


హైదరాబాదు,
15—2—61.

"చిరంజీవి అనూరాధకు,

"మీ బావ రజనీకాంతం వెక్కు దీవెనలతో వ్రాయడం. ఇచ్చట నేను క్షేమం. అచ్చట నువ్వు కులాసాగానే ఉన్నావని తలుస్తాను.

"హాస్టల్లో ప్రతిదానికి 'క్యూనే' అని ఆశ్చర్యపడ్డావు. కానీ, అందులోనే ఆనందం ఉందని నా అభిప్రాయం. 'చదువు సరిగ్గా సాగడంలేదు. పరీక్షలు దగ్గరకు వస్తున్నా'యని బాధపడ్డావు. పాడు చదువుకోసం అంత బెంగెందుకూ? మార్చి కాకుంటే సెప్టెంబరు ఉండనే ఉందాయె? అలాగని నువ్వు పాసుకావడం నా కిష్టంలేదని కాదు. నువ్వు పాసుకావాలనే నేను భగవంతుణ్ణి మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

"ఇవన్నీ ఇలా ఉండగా పెద్దవాళ్ల గొడవొకటి. పెళ్లి గురించి ఉత్తరాల మీద ఉత్తరాలు! ఇంటికి వెళ్లినప్పుడు ఈ గొడవ ఎటూ ఉందాయె! ఈ హాస్టల్లో ఉన్న నాలుగు రోజులన్నా ప్రశాంతంగా ఉండనిచ్చేటట్టు లేదు. 'మీ బావను చేసుకోనన్నావటగా? ఏమొచ్చింది?' అంటూ తాతయ్య పది పేజీల ఉత్తరం నాలుగు రోజుల క్రితం రిజిష్టరు చేశాడు! అమ్మ ఇక సరేసరి! పెళ్ళి అక్షింతలకు అంతేలేదు! అయినా నాకు తెలీకడుగుతా, బావా! వీళ్లకు నా పెళ్లి విషయంలో జోక్యమెందుకు? ప్రేమించకుండా పెళ్లెలా చేసుకోవడం? పిల్లింకా బి. ఎ. లోనే ఉన్నారు బావా! నువ్వయినా కాస్త చెప్పు' అని ప్రార్థనా పూర్వకంగా వ్రాశావు.

"నాక్కూడా అలాగే అనిపిస్తుంది. వీళ్లన్నారే—అక్కయ్యా, నాన్నా—ఈ కాలానికి తగరుస్మీ అనిపిస్తుంది. ఏదో పెద్దవాళ్ళు. వాళ్ల తాపత్రయాలు వాళ్లకుంటాయి. పోనిద్దూ! మొన్న నాన్న నాకో పది పేజీల ఉత్తరం రిజిష్టరు చేశారు! నువ్వు నన్ను నిరాకరించినందుకు కారణాలు నేను చెప్పుకోవాలట! తమాషాగా లేదూ? మొన్న నీ ఉత్తరం చూశాక కాస్త కుదుటబడ్డావనుకో! 'ప్రేమించి గానీ మీ మనమరాలు పెళ్లిచేసుకోదట!' అని నాన్న కో ఉత్తరం వ్రాసి పడేశాను!

"అన్నట్టు నీ ఉత్తరం చదివాక నాకూ నీ అభిప్రాయమే కలిగింది సుమా! ఇన్ని పుస్తకాలు చదివి, ఇన్ని సినిమాలు చూసి, ఇంత చదువు చదివినా ఇన్నాళ్ళుగా నా కిలాంటి ఊహ కలగనందుకు నిజంగా చాలా సిగ్గుగా ఉంది. అందరి బుర్రలూ ఒకేలాగు పనిచేస్తే ప్రపంచం నిలుస్తుందా చెప్పు?

"ఇంతకూ చెప్పవచ్చేదేమంటే, నేనూ ప్రేమించే పెళ్లి చేసుకోవా లనుకుంటున్నాను. కాబట్టి ఇంటిదగ్గరినుంచి వచ్చే డోసుల్లో అర్థభాగం నాకూ వస్తాయి. మరేం బాధపడకు!

"కాలేజీ, గదీ తప్ప ఇతరత్రా కాలక్షేపమే లేదు. పుస్తకాలున్నాయనుకో. అది వేరే విషయం.

"రెండు రోజుల క్రితమే నా గదికి ఎదురుగా ఉన్న మేడలో ఎవరో ఇంజనీరుగారట చేరారు. ఈ రోజు ఉదయం నీకు ఉత్తరం వ్రాస్తూ కిటికీలో నుంచి అలా యథాలాపంగా చూశాను. ముందు తోటలో పూల మొక్కలను పరీక్షిస్తూ నిల్చుని ఉంది ఓ యువతి. 'స్కైడు పోజులో' కొంచెం నీలాగే ఉంటుంది. ఉత్తరం వ్రాయడం మానేసి అలాగే రెప్పవేయకుండా చూడసాగాను. తోటమాలితో ఏదో మాట్లాడి లోపలికి వెళ్లుతూ వీధివైపోసారి చూసింది. నీకంటే చాలా అందంగా ఉంది.

"గులాబి రంగంటే నువ్వు నమ్మవేమో!

"నల్లని నొక్కుల జుట్టు!

"సంపంగిలాంటి నాసిక!

"విశాల నీలినయనాలు!

"కోల ముఖం!

"సన్నగా, పొడుగ్గా, అందంగా ఉంది. సూదంటురాయిలా నా దృష్టిని ఆకర్షించి కట్టి వేసింది.

"నడకలో ఎంత హొందా! చూపుల్లో ఎంత గంభీరత! ఇంతవరకూ అంతటి సౌందర్యరాశిని చూడలేదంటే నమ్ము!

"తర్వాత ఆ అమ్మాయి తమ్ముడు గాబోలు—వాణ్ణి కాలేజీలో ఏ క్లాసులోనో చూసినట్టు గుర్తు—ఇంట్లోనుంచి వచ్చాడు. అలాగే చూస్తుంటే ఫలాని లెక్చరర్‌గారు ఇలాగని ప్రచారం చేస్తాడు గాబోలని బలవంతంగా దృష్టిని నీ ఉత్తరంమీదకు మళ్లించాను. ఇంకేం విశేషాలు లేవు. బాగా చదువుకో.

ఇక ఉంటాను.
నీ బావ రజని."

* * *

హైదరాబాదు,
20—2—61.

"చిరంజీవి అనూరాధకు,

"మీ బావ హృదయపూర్వక ఆశీస్సులు. రెండు రోజుల క్రితమే నీ జాబు చేరింది. నువ్వు కావాలన్న 'ఎకనామిక్స్' పుస్తకాలు నా దగ్గర లేవు. నాది సైకాలజీ మెయినని నీకు బాగా తెలుసుగా? నా దగ్గర ఎకనామిక్స్ పుస్తకా లెలా దొరుకుతాయి? నీ కంతగా అవసరమైతే కొని పంపుతాను. సరేనా?

"ఎదురింటి అమ్మాయిని గురించి వెయ్యి ప్రశ్నలు వేశావు! ఎన్నిటికని సమాధానం చెప్పను? ఆ అమ్మాయి తమ్ముడు నా దగ్గర ఇంగ్లీషు ట్యూషన్ చెప్పించుకొంటున్నాడు.

"ఆ సుందరి నా శిష్యుని అక్కయ్య! పేరు జీవని! ఎంచక్కాలేదూ? నాకు తెలీకుండానే ఆ పేరును ఓ లక్షసార్లన్నా జపం చేసుకుంటాను! బి. ఎ. పాసయిందట. ఇంగ్లీషు నవలలు చదవడం, ప్రేమ కథలు వ్రాయడం (ఒకటీ అచ్చు కాలేదనుకో), తోటపని—ఇవి జీవని వినోదాలట.

"ఎలా తెలుసంటావేమో? ఏంచెయ్యను? మరి నీకోసం శిష్యుడి దగ్గరినుంచి వివరాలు సేకరించక తప్పిందికాదు. ఇంతకన్నా ఎక్కువ విషయాలు జీవనిని గురించి చెప్పలేనందుకు విచారిస్తున్నాను.

"నిన్న సాయంత్రం ఏం జరిగిం దనుకున్నావు? కాస్త గాలి పీలుద్దామని వరండాలో వాలు కుర్చీ వేసుకుని పత్రిక చదువుతున్నాను. వరండాలో పాదాల చప్పుడైంది. 'ఎవరా?' అని చూద్దును కదా? ఇంకెవరున్నారు? శిష్యుడు! 'ఏవన్నా ఇంగ్లీషు నవలలుంటే తెమ్మందండీ, అక్కయ్య!' అన్నాడు.

"పేపర్లోనుంచి దృష్టి మళ్లించి వాళ్ల వరండావేపు చూశాను. వరండాలో నిల్చుని ఇటే చూస్తున్నది జీవని! నే నటు చూడగానే చూపులు త్రిప్పుకుంది. రెండు పుస్తకాలు పంపాననుకో! ఏమిటో ఎప్పుడూ జీవని సమక్షంలోనే ఉండాలనిపిస్తుంది!

ఇక సెలవు.
నీ బావ రజని.''

* * *

హైదరాబాదు,
5—3—61.

"చిరంజీవి అనూరాధకు,

"ఆశీస్సులు. నీవు వ్రాసిన జాబు చేరినది. ఎలాగయినా పుస్తకాలు కావాలని వ్రాశావు. కొన్ని పుస్తకాలు షాపుల్లో గూడా లేవట. అయినా ప్రయత్నించి చూస్తాను.

" 'జీవనితో నీ పరిచయం ఎంతవరకు వచ్చింది?' అని వ్రాశావు. పర్వాలేదు. అభివృద్ధి బాగానే ఉంది. మూడు రోజుల క్రితం జీవని పుట్టిన రోజు పండుగ జరిగింది. ఒక చిన్న పెళ్లి చేసినట్టు చేశారు. ఇంజనీరు గారికి ఒకే ఒక ముద్దుల పట్టి కావడంచేత మగపిల్లలకు పుట్టిన రోజు పండుగలు జరిపినా జరపకున్నా జీవనికి మటుకు తప్పకుండా చేసి తీరుతారట.

"వాళ్లమ్మా, నాన్నా, అక్కయ్యా నన్ను తప్పకుండా విందుకు రమ్మన్నారని, రానంటున్నా వినిపించుకోక లాక్కెళ్లాడు మా వాడు. అనుకోకుండా వెళ్లవలసి రావడంచేత ఉట్టి చేతుల్తో వెళ్లక తప్పిందికాదు. అందరూ సాదరంగా ఆహ్వానించి ఆప్యాయంగా మాట్లాడారు. ఇంజనీరు గారు నా పుట్టు పూర్వోత్తరాలన్నీ లాగారు. వాళ్లమ్మాయిని గురించి కనీసం ఓ గంటసేపన్నా మాట్లాడుంటారు. జీవని ఇంజనీరుగారి జీవం లాగుంది. ఏడు గంటలకు ఇంజనీరుగారు నన్ను వదిలిపెట్టారు, అదీ ఎవరో స్నేహితులు రావడం

'వాచస్పతి'

వేశ!

"ఎంత పరిచయం లేకున్నా విందుకు వెళ్లి జీవనికి కనీసం అభినందనలు అన్నా చెప్పకుండా ఎలారావడం?

"ఇల్లంతా లైట్లు వెలుగుతున్నాయి. అంత పెద్ద ఇంట్లో జీవని ఎక్కడుందని వెతకను? ధైర్యంచేసి మేడమీదకు వెళ్లాను. మేడమీద వరండాలో కూర్చుని బహుమతులన్నీ ఒక్కొకటే పరిశీలనగా చూస్తున్నది.

"తెల్లని షిఫాన్ జరీ చీర.

"తెల్లని వెల్‌వెట్ జాకెటూ.




ప్రేమ ఉదయించడానికి కారణం ఉండవచ్చు; లేక పోవచ్చు. ప్రేమించడం అంత ప్రయాసతో కూడినదికాదు. కాని ప్రేమ అంకురించినట్లు తెలుసుకొనడానికి మాత్రం ఒకప్పుడు సాధనం అవసరం అవుతుంది.



చైతన్య చిహ్నాలు    ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రోహతక్)

# జీవని

"తలంటుకున్న తలనిండా పరిమళాన్ని వెదజల్లుతున్న విచ్చిన మల్లెలా.

"ఆ బహుళ పంచమినాటి వెన్నెల్లో జీవని ఎంత అందంగా ఉందని!

"ఎలా పిలవాలో, ఏంమాట్లాడాలో తెలీక ఓ క్షణం అలాగే నిలుచున్నాను.

"కాళ్ళు వణుకుతున్నాయి.

"గొంతులో తడి ఆరిపోయింది.

"కాలేజీలో వందమందికిపైగా ఉన్న క్లాసును కనుసన్నల్లో పెట్టుకునే నేను ఆక్షణంలో అంతగా భయపడ్డానంటే...ఇప్పుడనుకుంటే నాకే నవ్వు వస్తుంది!

"ఎంతసేపని అలా ఉండను? ధైర్యంచేసి ఓ అడుగు ముందుకు వేశాను. తడబడే గొంతుతో 'విష్‌యు మెనీ రిటర్న్స్ ఆఫ్ ది డే!' అన్నాను.

"జీవని కళ్లెత్తి చూసింది.

" 'థాంక్యూ వెరీమచ్.' సన్నగా నవ్వుతూ అంది. తర్వాత ఏం మాట్లాడాలో తెలీలేదు.

" 'కూర్చోండి!' కుర్చీ చూపుతూ అంది.

"కూర్చున్నాను.

" 'ముందుగా అనుకోకపోవడంచేత బహుమతులు ఏమీ తేలేకపోయాను.' చేతులు నలుపుకొంటూ అన్నాను.

" 'పర్వాలేదు...కానుకలు తెస్తేనే ఆప్యాయత ఉందని నే నేరోజూ అనుకోను.' ఓరగా తలెత్తి అంది.

"ఆమె చూపుల్లో, మాటల్లో, ప్రతి కదలికలో ఓ విలాసం, వినమ్రత కనిపిస్తాయి. కాటుక దిద్దిన కళ్ళు ఆ రోజు మరీ అందాన్ని కుమ్మరిస్తున్నాయి.

"ఓ అరగంటసేపు పుస్తకాలమీద చర్చ సాగింది. జీవని అందం, వాక్చాతుర్యం, తెలివితేటలు, నిండుకుండలాంటి గాంభీర్యమూ నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. అప్పుడప్పుడూ రావలసిందిగా జీవని కోరింది. 'సరే' నంటూ సెలవు తీసుకుని వచ్చేశాను.

"ఈ రోజు సాయంత్రం జీవనీ వాళ్ళింటికి వెళ్ళాలనుకుంటున్నాను.

నీ, బావ, రజని."

* * *

హైదరాబాదు,
15—3—61.

"చిరంజీవి అనూరాధకు,

"ఆశీస్సులు. నీ ఉత్తరం చేరింది. పుస్తకాల కోసం ఎలాగయినా ప్రయత్నించమని మరీ మరీ వ్రాశావు. నా శక్తివంచనలేకుండా ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. నువ్వు వ్రాసిన జాబితాలోని కొన్ని పుస్తకాల పేర్లు షాపువాళ్ళు అసలు వినలేదట! మీ మిత్రులూ, నువ్వూ కలిసి పరిశోధన చేసి ఆ పుస్తకాలు వ్రాయదలచుకున్నారేమో అన్న అనుమానం గూడా లేకపోలేదు నాకు!

" 'జీవనీ వాళ్లింటి కెళ్లావా? వెళ్తున్నావా?' అని వ్రాశావు. వెళ్లాను. వెళ్తున్నాను. జీవని రమ్మని అంతగా చెబితే వెళ్లకుండా ఉండడం ఏంబాగుంటుంది చెప్పు? అన్నట్టు పుట్టిన రోజు పండుగకు నేనేం బహుమతి తీసుకు వెళ్ల లేదుగా? మొన్న తీసుకువెళ్లాను. ముచ్చటైన ముత్యాల ఉంగరం! జీవని ముందు కోపగించు కుంది. అంత వెలగల బహుమతి తీసుకోనంటే తీసుకోనంది. అలాగయితే ఇక వాళ్లింటికి రానని చెప్పాను. వాళ్ల నాన్నగారు రాగానే నామీద ఫిర్యాదు చేసింది. ఆయన నవ్వుతూ నన్ను మందలించారు.

"జీవని ఇప్పుడు ఎన్ని విషయాలు మాట్లాడు తుందని! వాళ్ల నాన్నగారి ఆఫీసు విషయాలు మొదలుకొని రష్యావాళ్ల అణ్వస్త్ర పరీక్షల వరకూ మాట్లాడుతుంది.

"ఈ మాటల మధ్యలోనే నీ మాటా వచ్చింది. నువ్వేం చేస్తున్నావని అడిగింది. ఎమ్.ఏ. చేస్తున్నావని చెప్పాను. నిన్ను చూడాలంది. ఇప్పు డల్లా వీలుకాదని చెప్పాను.

'అనూరాధ మిమ్మల్ని పెళ్లి చేసుకుం టుందా?' తలవంచుకుని మెల్లగా అంది.

'ఊహు...చేసుకోదట.'

'ఏం?'

'ఎవణ్నో ప్రేమించి చేసుకుంటుందట!' అన్నాను నవ్వుతూ.

'అలాగా! అయితే తప్పకుండా అనూ రాధను చూడాలి' అంది.

"వీలైతే తొందర్లోనే చూపిస్తానన్నాను.

"జీవని సమక్షంలో రోజో క్షణంలా గడిచి పోతుంది. నీకు జాబు వ్రాయనుగూడా సమయం లేదంటే నమ్ము!

సెలవు.

నీ బావ, రజని."

* * *

హైదరాబాదు,
25—3—61.

"చిరంజీవి అనూరాధకు,

"దీవెనలు. నీ జాబు చేరింది. దొరికిన పుస్తకాలు పంపమని వ్రాశావు. నాలుగు పుస్తకాలు దొరికాయి. ఈరోజే రిజిస్టర్ పార్సెల్ చేశాను.

'జీవని నాకన్నా అందమైందా? తెలివైందా? జీవని నిన్ను ప్రేమిస్తోందా? మీపెళ్లికి ఇంట్లో వాళ్లు ఒప్పుకుంటారా?' ఇలా సవాలక్ష ప్రశ్నలు కురిపించావు!

"వీటన్నిటికీ జవాబు చెప్పడం చాలా కష్టం! అయినా నువ్వు అడుగుతున్నావు గనక చెబు తున్నాను. జీవని నీకన్నా అందమైందే! అందులో సందేహంలేదు. విజ్ఞానంలోనే కాదు, వివేకంలో గూడా నిన్ను మించిందే! ఇక జీవని నన్ను ప్రేమి స్తోందా అన్న ప్రశ్నకు 'ఔ'ననే చెప్పవచ్చు.

"మొన్న ఆదివారం పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్లాము.





"జీవని ఆ రోజు తను చదివిన నవలను గురించి, అందులోనిపాత్రలనుగురించి మాట్లాడు తున్నది. నేను వింటున్నాను. కథలోని అమ్మాయి మనసారా ఇష్టపడి పెళ్లి చేసుకుంటానన్న అబ్బా యిని తిరస్కరిస్తుంది. కారణం—ప్రేమించని వాణ్ణి పెళ్లి చేసుకోలేనంటుంది.

"తర్వాత ఓ అబ్బాయిని ప్రేమిస్తుంది. 'నిన్ను ప్రేమించలేదు గనక చేసుకోలేనంటాడు' ఆ అబ్బాయి!

"భూమీ, ఇల్లూ, చెట్లూ (సినిమాలోలా) గిర్రున తిరిగినట్లవుతుంది ఆ అమ్మాయికి. తర్వాత ఆ అమ్మాయి జీవితమంతా ఓ నిరాశా గీతిక!

'ఆ అమ్మాయి చేసిన పొరపాటేమిటి?' అన్నాను.

'ప్రేమించి పెళ్లి చేసుకోవాలన్న మోజులో పడిపోవడం. జీవితం యథార్థ రూపాన్ని గుర్తించ లేకపోవడం' అంది విచారంగా జీవని.

"జీవితంమీద జీవనికి గల నిశితాభిప్రాయా లను గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను.

'ఏమిటా ఆలోచన?' జీవని ప్రశ్నిం చింది.

'ఏమీలేదు.'

'లేకపోవడ మేమిటి? అనూరాధను గురించా?'

'ఛా! కాదు. అనూరాధ నా ఆలోచనల నుంచి ఏ రోజో తప్పుకుంది. నిన్ను గురించే జీవనీ!' అన్నాను ప్రేమగా.

"జీవని ఓ క్షణం నా కళ్లల్లోకి చూసి చూపులు దూరంగా తిప్పుకుంది.

'జీవనీ! నువ్వు నా జీవం!' తలవంచుకునే తమాషాగా నవ్వింది జీవని.

'ఈరోజే ఈ విషయం మీ నాన్నతో చెబుతాను.'

'అనూరాధను చేసుకోక నన్ను చేసుకుంటే, మీవాళ్లు ఊరుకుంటారా?' అంది.

'ఒప్పుకోక ఏంచేస్తారు? ఫాలాక్షుడు అడ్డు పడ్డా మనపెళ్లి జరిగి తీరవలసిందే!' అన్నాను.

'ఇలాంటి రత్నాన్ని నాకోసం వదిలేసిన అనూరాధకు ఎలా వందనాలు చెప్పుకోవాలో అర్థంకావడంలేదు. అడ్రసు చెప్పండి. ఉత్తరం వ్రాస్తాను' అంది సిగ్గు తెరలను తొలగించి.

" 'మన పెళ్లి కెటూ వస్తుందిగా? అప్పుడు చెబుదువుగానీ' అన్నాను.

"వాళ్లింట్లో వాళ్లంతా మా పెళ్లికి ఒప్పు కొన్నారు. ఇక ఎటొచ్చీ, నాన్నా, అక్కయ్యా, నువ్వూ ఇష్టపడాలి. కానీ, మీలో ఎవరు ఒప్పు కున్నా, ఒప్పుకోకున్నా నేను జీవనిని పెళ్లాడి తీరుతాను.

"జీవని సినిమాకు రమ్మంది. వెళ్లాను. సెలవు.

నీ, బావ, రజని."

* * *

ఆ ఉత్తరం పోస్టు చేసిన నాలుగో రోజు

ఉదయం రజనీకాంతరావు టెలిగ్రాం తీసుకుని, చింపి చదువుకున్నాడు. 'కమింగ్ టు సీ యువర్ జీవని—అనూరాధ.'

కాజువల్ లీవుపెట్టి అనూరాధకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు రజని.

సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు మార్చి ఎండలో మాడుతూ గదిలో అడుగు పెట్టింది అనూరాధ.

ముఖం కందగడ్డలా ఉంది. కళ్ళు అంతకు మించిన ఎరుపును రంగరించుకున్నాయి.

"అనూ! ఏమిటిది? ఈ టెలిగ్రా మేమిటి? నువ్వు రావడమేమిటి? ముందు వెళ్ళి ముఖం కడుక్కురా!"

ఐదు నిమిషాల తర్వాత స్నానాల గదిలో నుంచి బయటకు వచ్చింది అనూరాధ.

"జీవనిని చూడాలనేనా రావడం?"

ఎర్రని కళ్ళెత్తి సూటిగా చూసింది అనూరాధ.

"చాలా కోపంతో ఉన్నావే? మంచి నీళ్ళేమన్నా కావాలా?

"అక్కర్లేదు!"

"సరే. భోంచేద్దాం పద. ఎప్పుడు తిన్నావో పాపం!"

"భోంచేసేందుకు రాలేదు." కఠినంగా అని విసురుగా ప్రక్క గదిలోకెళ్ళి పడక కుర్చీలో పడిపోయింది.

"అదేమిటి? ఎవరిమీద అలక? ఎవరితోనన్నా పోట్లాడి వచ్చావా?"

"________"

"అక్కయ్యమీదా?......"

"________"

"నాన్నమీదా?"

"________"

"మీ మిత్రులతో?...."

"లేదు!" గట్టిగా అరిచింది అనూరాధ.

"మరి ఏమిటిది? అక్కయ్యకు టెలిగ్రామివ్వనా?"

"ఏమని? నేను చచ్చాననా?"

"అనూ! పిచ్చెక్కిందా?"

"ఆ!. . . . ఎక్కింది!"

"నీ మనసులో మాటేమిటో చెప్పరాదూ? ఎందుకలా బాధపడడం? నేనేం పరాయివాణ్ణా?"

"మరే! పరాయివాడివేం ఖర్మం! అయిన వాడివేగదూ?" కళ్ళనిండా నీళ్ళు కుక్కుకుని అంది.

"ఎందుకలా సాధిస్తావు? ఏం జరిగింది?"

"మీ జీవని ఎక్కడ?" కళ్ళల్లోని ఎరుపును కుమ్మరిస్తూ అంది.

"ఎందుకు? జీవనితో ఏంపని?"

"చూడాలి."

"ఎందుకు?"

## జీవని

"మాట్లాడాలి."

"ఏమిటి?"

"ఇది ధర్మమేమో అడగాలి."

"ఏది?"

"ఇలా నిన్ను పెళ్ళిచేసుకోవడం?"

"ఎందుక్కాదు?"

"నే నుండగా?"

"నువ్వు చేసుకోనన్నావుగా?"

"అప్పుడన్నాను...."

"ఇంకేం ప్రయోజనముంది? అంతా మించి పోయింది."

అనూరాధ గిరుక్కున ముఖం తిప్పుకుని, కన్నీళ్ళు తుడుచుకుంది, రజని కంట పడకూడదనే ఉద్దేశంతో.

రజని చూడనే చూశాడు!

హృదయం మైనంలా కరిగి ప్రవహించింది.

"జీవనితో మాట్లాడక తప్పదంటావు?" మెల్లగా అన్నాడు.

"అవును."

"ఇలారా, చూపుతాను."

కిటికీ దగ్గరగా వస్తూ పిలిచాడు. అనూరాధ కిటికీ దగ్గరకు వచ్చింది.

"అలా చూడు!"

కిటికీలోనుండి వెలుపలికి చూసింది.

"ఏముంది?"

"వర్క్‌షాపు."

"ఇంకా అర్థంకాలా?"

"ఏమిటి?"

"ఇక్కడ ఇంజనీరుగారి మేడలేదు."

"ఊ...."

"జీవనిలేదు, యామినిలేదు. తెలిసిందా? ఇక ఏడవకు."

అనూరాధ ఆశ్చర్యంతో తేలిపోయింది. ఆనందంలో సోలిపోయింది. పాతాళంలో క్రుంగిపోతున్నప్పుడు, స్వర్గద్వారాలు హఠాత్తుగా తెరుచుకొని స్వాగతం పలికినప్పుడు ఎలాంటి విచిత్రానుభూతి కలుగుతుందో అలాంటి అనుభూతి కలిగింది అనురాధకు.

కలా? నిజమా అని చుట్టూ కలయజూసింది. రజని నవ్వుతూ కనిపించాడు.

"జీవని లేదా?" ఎలాగో చివరికి అనగలిగింది.

"ఉహూ..." తల అడ్డంగా తిప్పాడు.

"అర్థమైంది...ఎంతమోసం!"

"నీకోసమే! ప్రేమించడం అనేది మోజులా తయారయింది...అందుకే...."

"మరి నీ వేసుకున్న ఫలితం రాకుంటే?" క్రింది పెదవి నొక్కి అంది.

"నే నంటే నీ కభిమానమే! కాని నీకు తెలీదు....నేను సైకాలజీ స్పెషలిస్టునని మరిచి పోతున్నావు, అనూ?"

"యు మస్ట్ బి కంగ్రాచులేటెడ్! రెండు గంటలకు బండి ఉంది. నే వెళ్ళతాను." తెచ్చుకొన్న కోపంతో అంది.

"హైదరాబాదు చూడకుండావే?" ఆశ్చర్యపడ్డాడు రజని.

"మళ్ళీ వస్తానుగా?" వీణలా మ్రోగింది అనూరాధ కంఠం.

"నిజం?" సంతోషం పట్టలేక అన్నాడు రజని.

"నిజం, బావా!"

"మరి ప్రేమమాట ఏం చేశావు?"

"ఏడుస్తున్నదాన్ని ఇంకా ఎందుకేడిపిస్తావు?" జాలిగా అంది.

"పూర్ ఫెలో! సరే! షాపింగ్ చూసుకొని స్టేషన్‌కు వెళ్ళదాము. నీ పుస్తకాల జాబితా తీసుకో."

"పుస్తకా లేం అక్కర్లేదు...జీవని విషయం కనుక్కోను అదొక మిష."

రజని ముఖం ఆశ్చర్యార్థకంగా మారిపోయింది!

అనూరాధ హృదయం వగిలిపోయేలా నవ్వింది! ★

## మీకు తెలుసా?

## జవాబులు

1. ఒకరకం చెట్లనుంచి లభించే ద్రవం. ప్రపంచంలో లభించే మొత్తంలో సగానికి పైగా అమెరికాలో తయారు అవుతున్నది.

2. ఇది నిజమైన దేశంకాదు. 1516 లో సర్ థామస్ మూర్ రచించిన గ్రంథంలోని కల్పనా ద్వీపం పేరు అది.

3. 1918 నవంబరు 11 వ తేదీని ముగిసినది.

4. గొరిలా, గిబ్బన్, ఛింపాంజీ, ఒరాంగ్‌టాంగ్.

5. 'బుష్‌మెన్'.

6. ఇబ్సెన్ (1828—1906).

7. ఫిన్లెండు.

8. గోబీ ఎడారి. ★